

అరుగుమీద కూర్చున్న సుందరరామయ్య రెండు చేతుల్నీ చేతికర్ర పిడిపైన ఉంచుకొని మౌనంగా రోదిస్తున్నాడు. అలా చాలాసేపటినుంచీ రోదిస్తూ కూర్చున్న సుందరరామయ్య అప్రయత్నంగా చేతితో కళ్ళను తడిమి చూసుకున్నాడు. ఒక బొట్టు కన్నీరు కూడా అతడి చేతికి చిక్కలేదు. మనసులో పేలవంగా నవ్వుకున్నా డతడు. తనలో కన్నీరు ఎప్పుడో ఇంకిపోయింది. ఆ మాటకు వస్తే, తనలో ఏది మాత్రం మిగిలిపోయిందని! మళ్ళిపోయిన వయసు పలచబడిపోయిన నెత్తురు తనకు దేనినీ మిగల్చలేదు.

అతడికి ఎంత రోదించినా దుఃఖం తీరడం లేదు. గుండెలపైన పేరుకుపోయిన బరువు ఇసుమంత కూడా తగ్గడం లేదు. కాలేజీ విడిచిపెట్టిన తరవాత ముప్పుతిప్పలు పడి తను చేరిన అదే ఆఫీసులో ఇరవై ఏళ్ళపాటు తనతో భుజాలు కలిపి, ఇంతవరకూ తనకేర్పడ్డ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన సంజీవి ఇక లేడు! ఇది ఏభై ఏళ్ళ సుందరరామయ్యకు నమ్మ శక్యం కాకుండా ఉంది. ఆ రోజు మధ్యాహ్నం భూమాత కడుపులోకి చొచ్చుకుపోయిన మిత్రుడి కళేబరాన్ని స్వయంగా చూసి కూడా, సర్వమూ అతడికి కలగా, కనికట్టుగానే అనిపించసాగింది.

"మా సంజీవి చచ్చిపోయాడు!"

ప్రచండ వాయు సంచలితమైన అరణ్యంలో, ఓ మూల దీనంగా, గుండెను

పిలుస్తూ వినిపించే విషాద గీతంలా అతడి హృదయం మూలగసాగింది. వరసగా ముగ్గురు ఆడపిల్లలను, ఆ తరవాత ఒక కుమారరత్నాన్నీ కన్న సుందరరామయ్య ఇప్పుడు ప్రపంచంలో ఒంటరిగా మిగిలిపోయినట్లు, ఆత్మీయు లెవరూ లేకుండా పోయిన అనాథలా బాధపడ్డాడు.

అంతవరకూ పెరట్లో మూల నక్క బట్టలు ఉతికిన శారద అక్కడకు వచ్చింది. పెద్దకూతురును చూసి సుందరరామయ్యకు దుఃఖం కట్టలు త్రెంచుకొని వచ్చింది.

"అమ్మా, శారదా! మా సంజీవి పోయాడు, తల్లీ! నీ పెళ్లి చూడకుండానే వెళ్లిపోయాడు, తల్లీ!"

"ఏడువకు, నాన్నా! మన చేతిలో ఏముంది, నాన్నా!" పైకి అంతమాటలన్నా, ఆమె కళ్లలో కన్నీరు ఉబికింది. పైట చెంగుతో రెండు కళ్లనూ ఒత్తుకొని, "ఇలా ఎంతసేపు నాన్నా, కూర్చుంటావు? లోపలకు వచ్చి స్నానం చేయి" అని దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో అడిగింది.

"వద్దు, తల్లీ! తరవాత చేస్తాను! నన్ని లాగే ఇక్కడ కొంచెం సేపు ఉండనివ్వు!"

శారద మాట్లాడకుండా వెళ్లిపోయింది.

• • •

వాస్తవానికి సంజీవరావూ, సుందరరామయ్యా బాల్యమిత్రులు కారు. వాళ్లిద్దరూ ఓ కంచాన తిని, ఓ మంచాన పడుకోవడం ఎప్పుడూ సంభవించలేదు. రెండు నెలల తేడాతో, ఇద్దరూ ఒకే సంవత్సరం ఒకే ఆఫీసులో ఉద్యోగ నిర్వహణకు కుదిరారు. అలా ఉద్యోగ నిర్వహణకు కుదిరిన రెండేళ్లకు గాని వాళ్లిద్దరూ ఒకే సెక్షన్‌లో పక్కపక్క సీట్లో కూర్చోవడం జరగలేదు.

మొదట్లో సంజీవరావు వాలకం సుందరరామయ్యకు ఏమాత్రం నచ్చలేదు. బాహ్యరూపం గురించి పిసరంత శ్రద్ధాశక్తులు లేని ఋషిపుంగవుడిలా, సర్వమూ తను ఒక్కడే అమూలాగ్రంగా అవగాహన చేసుకున్న పారంగతుడిలా ముఖం పెట్టి అంటీ అంటనట్లు నిర్లిప్తంగా సంచరించే సంజీవరావు చాలా తలబిరుసైన వాడని తను గట్టిగా నిర్ణయించుకొన్నాడు. ఎప్పుడూ బల్లిలా సీటుకి కరుచుకుపోయి, దించిన తల ఎత్తకుండానే ఫైళ్లు మీద గీతలు గీస్తూ కనిపించే సంజీవరావంటే అతనిలో అసహ్యం వంటి దేదో బయలుదేరింది. గజిబిజి ఫైళ్ల మధ్య, ఆఫీసరుల దెప్పి పొడుపుల నడుమ, సెక్షన్ అంతటా పేరుకుపోయినట్లు కనిపించే బరువైన నిశ్శబ్దాన్ని, బిర్ర బిగుసుకుపోయే వాతావరణాన్ని సడలించేందుకు ఓ చిట్కా, కనీసం ఓ మాటా మంతీ ఎంత అవసరమో ఈ ఋషిపుంగవుడికి అర్థం కానట్లుండేదని చీదరించుకొన్నాడు. బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నంత మాత్రాన ఆఫీసు వ్యవహారాల్లో కాకలు తీరిన వాడనే ప్రతీతి లభిస్తుందనే సంకుచిత స్వభావం కావచ్చు. తోటి క్లర్కులు ఎంత గట్టిగా మాట్లాడుకొని, ఎంత గట్టిగా నవ్వుకొన్నా, మర్యాదకైనా తలఎత్తకుండా కూర్చునే సంజీవరావుని చూసి, తనకేగాక, చాలామందికి మంటగా ఉండేది. అతడు అలాగే కూర్చుని ఉన్నా బాగుండును. అప్పుడప్పుడు అతడు నోరు తెరిచేవాడు. ఎందుకని? "ఈ రోజు పెర్సనల్ రిజిష్టరు ఆఫీసుకి సబ్‌మిట్ చేయాలి కదూ?" అని అందరివేపూ ఓ సారి చూసి, నిశ్శబ్దంగా తల దించుకునే వాడు. దీనితో తమ కందరకూ ఎక్కడలేని కోపమూ పుట్టుకొచ్చేది. అతడు తెలిసి అడిగేవాడో, తెలియక అడిగేవాడో గాని, తమకు మాత్రం ఆ ప్రశ్నలో 'మిస్‌ఛీవస్ మోటివ్' కనిపించేది.

"ఓరి ముద్దు మొహాల్లారా! ఆఫీసుకి ప్రోగ్రెస్ చూపించాలి. నాలాగ తలలు వంచుకొని బుద్ధిగా పనిచేయండిరా!" అన్నట్లు వినిపించేది. ఏది ఏమైనా సరే, ఈ పల్లెటూరి బైతుతో తానుగా వెళ్లి మాట్లాడకూడదని తను కంకణం కట్టుకున్నాడు.

ఒకసారి తను జ్వరం పడి, ఓ వారం రోజులు మెడికల్ లీవు తీసుకున్నాడు. లీవు పూర్తయిన తరవాత తను డ్యూటీలో చేరాడు. సీటులో కూర్చున్న కొన్ని నిమిషాల్లోనే తనను రమ్మని ఆఫీసరు గదిలోంచి కబురు వచ్చింది. అదిరిన గుండెను దిటవుపరుచుకుంటూ తను ఆఫీసరు గదిలోకి ప్రవేశించాడు.

"ఎస్, సుందరరామయ్యా! ఆఫీసు పనిలో మీరు చాలా మందకొడిగా ఉంటున్నారని సూపరింటెండెంటు నోట్ వ్రాశారు."

"అయామ్ సారీ, సర్! నేను వారం రోజులు మెడికల్ లీవులో ఉన్నానండీ!"

"నో! యూ ఆర్ నాట్ కరెక్ట్! మీ దగ్గర పెండింగ్ ఉన్న పేపర్లు వారం రోజులవి కావు. నెల రోజులపైగా మీ దగ్గర పెండింగ్ పేపర్లు ఉన్నవి. అవునా?"


తన గొంతు కలో వచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఆఫీసరుకి ఏం జవాబు చెప్పాలో తోచక, తను బిత్తరపోయి చూశాడు. ఆఫీసరు తన పరిస్థితి చూసి, దరహాసం చేశాడు. తను మౌనంగా తల వంచుకొన్నాడు.

"మరో వారం రోజుల్లోపల పేపర్లన్నింటినీ క్లియర్ చేసెయ్యండి." కళ్లద్దాలను ఓ సారి సవరించుకొని ఫైలు చూడటంలో మునిగిపోయాడు ఆఫీసరు. ఆనాడు తనకు వచ్చిన నీరసం, జ్వరం వచ్చినప్పుడు కూడా రాలేదు. తోటి క్లర్కుల ముందు ముఖాన్ని వ్రేలవేసుకొని పోకూడదని చేతి రుమాలుతో ముఖం గట్టిగా తుడుచుకొని, లేని నవ్వును పులుముకొని, సీటులోకి వచ్చి కూర్చున్నాడు.

ఈ అపాయం నుండి తప్పుకోవాలంటే ఎవరో ఒకరు తనకు చేయూత ఇవ్వాలి. ఇవ్వబోయే సహాయం తక్షణం లభించాలి. కళ్లు ఫైలును చూస్తున్నాయే గాని మనసుమాత్రం ఎక్కడో ఆలోచిస్తూంది. ఆ విషమ పరిస్థితి వల్ల మరో పది రోజులు జ్వరం వచ్చి ఉంటే ఎంతో బాగుండుననిపించసాగింది.

"సుందరరామయ్యగారూ!" తను తల పైకెత్తాడు. సంజీవరావు సీటు దగ్గరకు వచ్చి నిలుచున్నాడు.

"ఇయర్లీ రిటర్న్ మీరే కంపైల్ చేయాలనుకుంటాను. మీకుగాని అభ్యంతరం లేకపోతే మని



విశ్రాంతి ఫోటో—బాలచంద్ర (నెల్లూరు)

రేజర్‌వల్ల కలిగే చర్మగాట్లు, సరిగా తెగని రోమ మొదువల్ల అవమానం భరించండి లేక...



ఏన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్ వాడి చర్మాన్ని పట్టులా కోమలంగా ఉంచుకోండి



క్షౌరమా?—అది కేవలం పురుషుల కోసం! క్షౌరం వల్ల చర్మం మీద గంట్లు పడటమే కాకుండా రోమములు దట్టంగా దుబ్బులా తిరిగి పెరుగుతాయి. ఎంత ఘోరం! దానికి బదులు కోమలాంగుల సుకుమారమైన పద్ధతిలో రోమములను క్రీముతో తీసి వేయండి. మృదువైన ఏన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్‌ను రాయండి. కొంత సేపు ఆగండి, తరువాత దానిని అనవసరమైన రోమములతో సహా తుడిచి వేయండి. అది చర్మం అడుగున పని చేసి చర్మాన్ని చాలా తరబడి పట్టువలె—నున్నగా ఉంచుతుంది. ఎంత లావణ్యమైన పద్ధతి! మీ లాగానే!! కనుక క్షౌరాన్ని మానండి. ఏన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్ వాడండి.

**ఏన్ ఫ్రెంచ్** హెయిర్ రిమూవర్
అనవసరమైన రోమముల నుండి
విముక్తికి వాంఛనీయమైన క్రీమ్
రెండు సైజులలో లభించును 40 గ్రా. & 75 గ్రా.

Licensed user of TM : Geoffrey Manners & Co. Ltd.

136 HR 242 Tel


ద్దరం కలిసి పెండింగ్ పేపర్సు క్లియర్ చేసేద్దాం. ఆ తరవాత మీరు నిర్ణీత కాలం లోపల ఇయర్లీ రిటర్న్ పూర్తి చేసుకోవచ్చు. ప్రస్తుతం నా సీటులో అంతగా పని లేదు." కొన్ని క్షణాలవరకూ తనకు నోరు పెగల్లేదు. తను సహాయం ఎదురుచూసిన విషయం వాస్తవమే. కాని, సంజీవరావునుండిమాత్రం కాదు!

"దయచేసి సంకోచించకండి. ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రతిచోటా ఉండాలి." అని చనువుగా పెండింగ్ పేపర్సు తీసుకొని పరీక్షించసాగాడు సంజీవరావు.

మరుసటి రోజునుంచీ తా మిద్దరూ కలిసి కాంటీనుకి వెళ్ళ నారంభించారు. తన కుటుంబ విషయాల గురించి అడిగి తెలుసుకొని, అతడి కుటుంబ విషయాల గురించి వివరించి చెప్పాడు. అప్పటికి సంజీవరావుకి పెండ్లయింది. ఇద్దరు మగబిడ్డలు, తల్లితండ్రులకు ఒక్కడే కొడుకు. తండ్రి రిటైర్డు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు.

ఒక రోజు ఆఫీసు పని మంచి రద్దీలో ఉన్న సమయంలో సంజీవి తన సీటు దగ్గరకు వచ్చి, ఏమాత్రమూ సందర్భ శుద్ధి లేని ఓ ప్రశ్న వేశాడు.

"నువ్వు లైఫ్ఇన్స్యూరెన్సు పాలిసీ తీసుకున్నావా, రామయ్యా?"

"లేదు."

"యూ షుడ్ టేకిట్ నౌ." తను సంశయాత్మకంగా సంజీవి వేపు చూశాడు. చాలామంది ప్రభుత్వోద్యోగులు భార్యల పేరనో, తల్లుల పేరనో ఏజెన్సీ తీసుకొని ఈ ఇన్స్యూరెన్సు వేట సాగించడం తనకు తెలుసు.

"ఏం, భార్యపేర ఏజెన్సీకాని తీసుకున్నావా?" ఇది విని సంజీవరావు కొంచెం చిన్నబుచ్చుకుంటాడని తను ఎదురు చూశాడు. కాని, అలా జరగలేదు. నడిరాత్రి ఒక్కసారిగా మంగళ తూర్యారవాలు మిన్నుముట్టినట్లు, మండిపోతున్న ఎండల్ని పటాపంచలు చేస్తూ, అకస్మాత్తుగా వర్షం కురవ నారంభించినట్లు సంజీవి పెద్ద పెట్టున నవ్వాడు. సెక్షన్‌లో వ్రాస్తున్న వారి కలాలు టక్కున ఆగిపోయాయి. అందరూ సంజీవి వేపు ఆశ్చర్యంగా చూశారు.

అది కాదోయ్! నేను చాలా రోజుల నుంచి గమనిస్తున్నాను, నువ్వు లావిష్‌గా ఖర్చుచేస్తున్నావు. ఇది భవిష్యత్తుకు మంచిది కాదు." ఇదే మాట మరింకెవరైనా అని ఉంటే, "అది నా ఇష్టం!" అని తడుముకోకుండా బదులు వచ్చి ఉండేది. సంజీవి దగ్గర తను అలా అనలేకపోయాడు.

"నాకు తెలిసిన ఏజెంటు వస్తాడు. ఫారంలు ఫిలప్ చేసి ఇయ్యి" అని అదే రోజు సాయంత్రం తన చేత మూడు వేలకు పాలిసీ తీసుకునేట్టు చేశాడు. నిజానికి తనకు అప్పట్లో ప్రీమియం కట్టడం అంత కష్టం అనిపించలేదు. అప్పటికి తన తండ్రి ఇంకా ఉద్యోగ విరమణ చేయలేదు. తనకు పెండ్లయి ఏడాది కూడా కాలేదు.

కాలమనే ఎడారిలో, ఏభైమూడు ఏళ్ళు నిర్విరామంగా ప్రయాణంచేసి కూడా, తన చత్వారపు కళ్ళను ఎంత పెగిల్చి చూసినా సాధనలనే కాలి గుర్తులు ఎక్కడా కనిపించడంలేదు. ఎన్నో రోజులు, ఎన్నో నెలలు, ఎన్నో సంవత్సరాలు నిరాటంకంగా, నిర్లిప్తంగా నడుచుకుపోయే జీవిత చక్రాన పడి, మాయమయాయి. వరవరాలలో పొంగిపొర్లే నవ్యోత్సాహంతో కాలవాహిని తరంగాల పైన తేలుతూ, కేరింతలు కొడుతూ గడిపిన రోజులు పోయాయి. అనంత నీలాంబర వాహినిఅయిన విశ్వప్రవాహంలో విచ్చలవిడిగా, అతి ప్రశాంతంగా ముందుకు సాగిపోయే ఆనందోజ్జ్వల తరంగం వంటి తన జీవితం రాను రాను బాధ్యతలు బరువు క్రింద నలిగి, మానసిక ఆందోళనల తాకిడికి చితికి, అంచనాకు అందకుండా మారిపోయింది. ఒక్కొక్కరుగా వయసుకి వచ్చేస్తున్న ముగ్గురు ఆడపిల్లలకూ, ఒక మగ కుర్రాడికీ తండ్రిగా రూపొందాడు. భార్య తోడుగా ఉన్నంతకాలమూ తనకు ఒకింత **ఆత్మశాంతి, ఆత్మవిశ్వాసం ఉండేవి.** గుండెపోటుతో ఒక రోజు తన భాగ్యం కళ్ళుమూసింది. ఈ దెబ్బకు తన భవిష్యత్తు గువ్వలా చెదిరిపోయి, చిక్కటి చీకటిలోకి మాయమయింది. ఏపుగా ఇంట్లో ఎదిగిపోతూన్న పెద్దమ్మాయిలిద్దరినీ చూస్తూంటే గుండె తరుక్కుపోసాగింది. ఒకవేపు కుర్రాడి చదువులతో కుస్తీ పట్టలేక, మరొకవేపు అమ్మాయిల పెళ్ళిళ్ళకు బేరాలు మాట్లాడలేక క్రుంగి కృశించిపోసాగాడు.

• • •

తనకు రక్తపుపోటు నలభయ్యవ పడిలో పడినప్పటినుంచీ ప్రారంభమయింది. ఇది చాలాసార్లు వచ్చింది. భాగ్యం బ్రతుకున్నప్పుడూ వచ్చేది. ఆ తరవాత కూడా వచ్చేది. కాని, అప్పట్లో దాని తాకిడి, తీవ్రతా చాలా తక్కువ.

ఈ మధ్య తనలో ఏర్పడిన నిస్సత్తువనూ, నిస్సహాయతనూ గమనించి

కాబోలు, రక్తపుపోటు ఒకేసారి తీవ్రంగా వచ్చింది. ఈ దెబ్బకు తట్టుకోలేక పోవడం వల్ల, తనను అస్పత్రిలో చేర్పించారు.

అస్పత్రిలో ఉన్నప్పుడు, తనను చూసి పోయేందుకు చాలా మంది వచ్చారు. ఆఫీసులోనుంచి కూడా వచ్చారు. దగ్గర బంధువులూ, దూరపు బంధువులూ కూడా వచ్చారు. పరామర్శించి, ధైర్యం చెప్పి వెళ్ళిపోయారు. ఆ సమయంలో సంజీవి కూడా భార్యను వెంటబెట్టుకొని వచ్చాడు. సంజీవరావును తను చాలా కాలం నుంచీ చూస్తూనే ఉన్నాడు. ఆ రోజు మాత్రం తన కేమయిందో తెలియదు, సంజీవి భుజాలపైన ముఖం పెట్టుకొని అప్రయత్నంగా ఏడ్చాడు. ఇది చూసి రఘు — "నాన్నా! ఏడవకండి, నాన్నా!" అని తన చేతిని పట్టుకున్నాడు.

"రఘూ, నువ్వూరుకో!" సన్నగా నవ్వి అన్నాడు సంజీవి. కొంతసేపటికి తను యథాస్థితికి వచ్చి, సంభాషించగలిగాడు.

"అవునుగానీ, మన వయసు ఇప్పుడెంతరా?" తేలికపడ్డ హృదయంతో ఉత్సాహాన్ని పుంజుకొని తను అడిగాడు.

"గాడిదగుడ్డు! మరో అయిదేళ్ళలోపల మనం రిటైర్ అవుతాం!"

"అవునుకదూ?"

"సరేగాని, ఇప్పుడు అసలు విషయం మాట్లాడదాం. ఈ రక్తపు పోటు అధికంగా ఎవరికి వస్తుందో తెలుసా? మితిమీరి మానసికంగా ఆందోళన చెందిన వారికి ఇది చాలా తొందరగా వస్తుంది. నువ్విలా ఆందోళనపడుతూ, మాటిమాటికీ జబ్బుపడుతూ, ఎదుటివారు టెంబేలు పడేట్టు చేస్తున్నావు." తను మౌనం వహించాడు.

"నిదానంగా ఆలోచించడం నీ కెప్పుడు చేతనవుతుందో! యూస్ లెస్ ఫెలో!" ఇది విని తను ఫక్కున నవ్వాడు.

"పిచ్చిగాని పట్టిందా—ప్రతిదానికీ నవ్వుతున్నావ్?"

"అది కాదురా! నువ్విప్పుడు 'యూస్ లెస్ ఫెలో' అని తిట్టావే—అది ఎప్పటి నుంచి చెబుతున్నావో తెలుసా?" ఈ సారి సంజీవి నవ్వకుండా ఉండలేకపోయాడు.

"అది అటుంచుగానీ, ఇప్పుడు మే మొక ముఖ్యమైన కార్యం మీద వచ్చాం. దానిని సఫలం చేసే బాధ్యత నీది."

"అదేమిట్రోయ్!"

"అది మీ చెల్లెమ్మ చెబుతుంది, విను."



"అవునన్నయ్యా, నేను చెపుతాను." పార్వతమ్మ కలగజేసుకుంది.

"ఎవరుచెబితే నేం?" తను నవ్వాడు.

"మా పెద్దబ్బాయికి బాంకులో ఉద్యోగం. అది మొన్ననే చిక్కింది. అంతకుముందు వాడు చిన్న కంపెనీలో అకౌంటెంటుగా ఉండేవాడు. మీ పెద్దమ్మాయిని మా వాడికి చేసుకుందా మనిమా ఆయనకు చాలా రోజులనించీ ఉంది. మీరు ఒప్పుకుంటారో లేదోనని నన్ను వెంట్పెట్టుకొని తొక్కువచ్చారు." తను మాట్లాడలేదు. చాలాసేపు వాళ్ళిద్దరి నేవు మౌనంగా చూస్తూ ఉండిపోయాడు.

"అదేమిటేరా, అలా చూస్తావ్? కట్నం కానుకల గురించి ఆలోచిస్తున్నావా?"

"ఇప్పుడు నా పరిస్థితి బాగాలేదురా."

"యూస్‌లెస్‌ఫెలో!వా గురించి నువ్వు గ్రహించగలిగింది ఇంతేనా? భాగ్యం వంటి మహా ఇల్లాలి పెద్దకూతురు మా ఇంటికి కోడలుగా రావడంఎంత పుణ్యంమేముకుంటే గాని సంభవిస్తుందిరా?" తన కళ్ళు చెమ్మగిల్లాయి.

పర్వత శిఖరం మీద నిలుచుని కూడా స్నేహితుడితో ఎంత అణకువగా, అప్యాయంగా మాట్లాడగలుగుతున్నాడు సంజీవి!

• • •

మందరరామయ్య ఆలోచనుండి తేరుకున్నాడు. చేతి కర్రను ఊతగా తీసుకొని, లేచి నిలుచున్నాడు. మెల్లగా అడుగులు వేస్తూ ఇంటి లోపలికి ప్రవేశించి, గోడపైన వేలాడుతూన్న మిత్రుడి ఫొటో వేపు తేరిపారచూస్తూ నిలుచున్నాడు.

"యూస్‌లెస్ ఫెలో! మగవాడు ఆడపిల్లలా ఏడవకూడదురా!" అని మిత్రుడి ముఖం నవ్వుతున్నట్లనిపించింది మందరరామయ్యకు. ✱